సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 23 । ఫిబ్రవరి । 2024



సోమశిలలో 19.05 టీఎంసీలు

సోమశిల: సోమశిలలో గురువారానికి 19.05 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నార్ డెల్టాకు 1900, ఉత్తర, దక్షిణ కాలువలకు 1100 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.64,100
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,757
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,929
నవర (8 గ్రాములు)	రూ.47,432

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
34.7 /24.2

గురువారం గాలిలో తేమ 65 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతున్నాయి. శుక్రవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

హోంగార్డ్స్ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



నెల్లూరు(క్రైమ్): నెల్లూరు జిల్లా హోం గార్డ్స్ డీఎస్పీగా సంకురయ్య తన కార్యాలయంలో బాధ్యతలను గురువారం స్వీకరించారు. ఆర్ఐ రమణారెడ్డి, సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, ఏఎస్పీ సౌజన్య తదితరులను మర్యాదపూర్వకంగా కలిశారు.

1996లో ఆర్ఎస్సైగా విధుల్లో చేరిక

పశ్చిమగోదావరి జిల్లా పోలవరానికి చెందిన సంకురయ్య 1996లో ఆర్ఎస్సైగా పోలీస్ శాఖలో బాధ్యతలు చేపట్టారు. నంద్యాల, ప్రకాశం, గుంటూరు, విజయవాడలో డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. గత నెల్లో జరిగిన ఏఆర్ డీఎస్పీల బదిలీల్లో జిల్లా హోం గార్డ్స్ డీఎస్పీ చంద్రమోహన్ బాపట్ల జిల్లాకు బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఆ పోస్ట్ ఖాళీగా ఉంది. దీంతో విజయవాడలో పనిచేస్తున్న సంకురయ్యను నియమించారు.

ఉచిత ప్రవేశాలకు 14 వరకు నమోదు చేసుకోవచ్చు

నెల్లూరు (టౌన్): ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో ఉచిత ప్రవేశాల కోసం ఈ నెల 23 నుంచి వచ్చే నెల 14 వరకు విద్యాశాఖ పోర్టల్లో పేర్లు నమోదు చేసుకోవచ్చని డీఈఓ రామారావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనాథ, హెచ్ఐవీ బాధిత పిల్లలు, దివ్యాంగుల కోసం ఐదు.. ఎస్సీలకు పది.. ఎస్టీలకు నాలుగు.. బీసీ, మైనార్టీ, ఓసీ పేద పిల్లలకు ఆరు శాతం మేర సీట్లను కేటాయించారని చెప్పారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను కేటాయించి 2024 – 25 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో ప్రవేశాన్ని కల్పించనున్నామని వివరించారు.

డిగ్రీ పరీక్షల్లో ఇద్దరి డీబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో గురువారం నిర్వహించిన డిగ్రీ ఒకటో సెమిస్టర్ పరీక్షల్లో ఇద్దరు డీబారయ్యారు. 4280 మందికి గానూ 4024 మంది హాజరయ్యారు. రాపూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు డీబారయ్యారని వీఎస్‌యూ పరీక్షల నిర్వహణాధికారి మధుమతి తెలిపారు.

ఆర్ అండ్ బీలో ఉద్యోగాలకు దరఖాస్తుల వెల్లువ

నెల్లూరు(బారకాసు): ఆర్ అండ్ బీ అతిథిగృహాల్లో విధులు నిర్వర్తించేందుకు అవుట్‌సోర్సింగ్ ద్వారా నియామకాలను చేపట్టనున్నారు. దీనికి సంబంధించి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆ శాఖ అధికారులు ఆహ్వానించారు. దీంతో నిరుద్యోగులైన అనేక మంది అభ్యర్థులు నగరంలోని ఆర్ అండ్ బీ సర్కిల్ కార్యాలయంలో మూడు రోజులుగా దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా తొమ్మిది ఆర్ అండ్ బీ అతిథిగృహాలున్నాయి. ఒక్కో అతిథిగృహంలో అటెండర్, వాచ్‌మెన్, శానిటరీ వర్కర్.. ఇలా ముగ్గురు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. అటెండర్ పోస్టుకు పదో తరగతి ఉత్తీర్ణులై 18 ఏళ్లు పైబడిన వారు అర్హులు. వాచ్‌మెన్, శానిటరీ వర్కర్ పోస్టులకు మాత్రం ఎక్కడైనా పనిచేసిన అనుభవం ఉంటే వారికి ఎంపికలో ప్రాధాన్యమిస్తున్నారు. ఎంపికలను కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నామని ఆర్ అండ్ బీ ఎస్ఈ గంగాధర్ తెలిపారు. చైర్మన్‌గా కలెక్టర్ తదితర 8 మంది సభ్యులతో కూడిన కమిటీ ఉంటుందన్నారు. ఇప్పటికే దాదాపు వందకుపైగా దరఖాస్తులు అందాయి. ఈ నెల 26 వరకు గడువు ఉండటంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య



నెల్లూరు రూరల్: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డు కాలనీలో చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. స్థానికంగా నివసిస్తున్న ఎలక్ట్రీషియన్ ప్రతాప్ సింగ్ (61)కు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. మద్యానికి బానిసైన ఈయన డబ్బులివ్వాలని భార్యను నిత్యం వేధించసాగారు. దీంతో ఆమె హైదరాబాద్‌కు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు కుమార్తెలూ ఆయనకు దూరంగా ఉండసాగారు. తనతో కుటుంబసభ్యులెవరూ లేరనే మనస్తాపంతో ఇంట్లో బుధవారం సాయంత్రం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గమనించిన ఇంటి యాజమాని నెల్లూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దించి పరిశీలించారు. అనంతరం జీజీహెచ్‌కు తరలించారు. పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు గురువారం అప్పగించారు. రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



సత్కారం అందుకున్న వలంటీర్లతో కాకాణి గోవర్ధన్‌రెడ్డి



హాజరైన వలంటీర్లు

వలంటీర్ల వ్యవస్థతో సుపరిపాలన

• మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థతో రాష్ట్రంలో సుపరిపాలనను సీఎం జగన్మోహన్‌రెడ్డి అందిస్తున్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెముడుగుంట వద్ద గల శ్రీడ్స్ కల్యాణ మండపంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. తొలుత దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహానికి మంత్రి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదలకు సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందజేయాలనే సంకల్పంతో సచివాలయ వ్యవస్థకు వలంటీర్లను అనుసంధానం చేశారని తెలిపారు. ఈ వ్యవస్థలను అమలు చేసేలా ఇతర రాష్ట్రాలు సైతం ఆలోచన చేయడం గొప్ప విషయమన్నారు. వలంటీర్ల వ్యవస్థతో జగనన్న పాలనకు మంచి పేరు వస్తుండటంతో ఓర్వలేక తప్పుడు ఆరోపణలను చంద్రబాబు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ వ్యవస్థపై వ్యతిరేకత తీసుకొచ్చేలా చంద్రబాబు చేసిన కుట్రలు ఫలించలేదని తెలిపారు. కొన్ని పత్రికలు పనిగట్టుకొని వలంటీర్ల వ్యవస్థపై తప్పుడు కథనాలను ప్రచురించినా, అపార నమ్మకంతో సీఎం ముందుకు సాగారని చెప్పారు. గత చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీల పెత్తనంతో అర్హులకు సంక్షేమ పథకాలు అందక అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రామ వలంటీర్లు సమర్థంగా పనిచేస్తున్నారని కొనియాడారు. అనంతరం ప్రముఖ వక్త చిరంజీవి మాట్లాడారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. అనంతరం గ్రామ వలంటీర్లను మంత్రి సత్కరించారు. డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, మండల వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, పార్టీ వెంకటాచలం, ముత్తుకూరు, మనుబోలు మండలాల కన్వీనర్లు కొణిదెన మోహన్‌నాయుడు, మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, హరిగోపాల్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కోడూరు ప్రదీప్‌కుమార్ రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, వేమారెడ్డి రఘునందన్ రెడ్డి, ఈపూరు రజనీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రీ పబ్లిక్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): పదో తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలను శుక్రవారం నుంచి వచ్చే నెల నాలుగు వరకు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన ప్రశ్నపత్రాలను ఇప్పటికే మండల రిసోర్స్ కేంద్రాలకు పంపారు. విద్యార్థులకు తరగతులను రోజూ ఉదయం నిర్వహించి.. మధ్యాహ్నం 1.15 నుంచి 4.30 వరకు పరీక్షను జరపాల్సి ఉంటుంది. అదే విధంగా ఈ నెల 23 నుంచి 28 వరకు ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ (ఎఫ్ఏ – 4) పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలను ఆన్‌లైన్లో పంపనున్నారు. సదరు పాఠశాల ఉపాధ్యాయులు ప్రింట్ చేయించడం లేదా ఐఎఫ్పీ, స్మార్ట్ టీవీ, ప్రొజెక్టర్‌ను ఉపయోగించి పరీక్షలను నిర్వహించాల్సి ఉంటుంది.

ఓపెన్ వర్సిటీలో ప్రవేశానికి ఫీజు గడువు పొడిగింపు

నెల్లూరు (టౌన్): అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశానికి ఫీజును ఈ నెల 29 వరకు చెల్లించొచ్చని స్టడీ సెంటర్ కోఆర్డినేటర్ పిచ్చయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 31 వరకు గడువు ఉందన్నారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీ కోర్సుల్లో ప్రవేశం ఉందని, వివరాలకు 73829 29611 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

• కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ఆత్మకూరు నియోజకవర్గ రెవెన్యూ సమస్యలపై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డితో కలిసి ఆర్డీఓ, తహసీల్దార్లతో సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ గురువారం నిర్వహించారు. కలెక్టరేట్లోని తన చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జగనన్నకు చెబుదాం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాల్లో వచ్చిన రెవెన్యూపరమైన అర్జీలను పరిష్కరించేందుకు అన్ని విధాలా కృషి చేయాలని ఆదేశించారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు సంగంలో పొరంబోకు భూములను మార్పు చేసి పట్టాలను అందజేశామని చెప్పారు. గత సమావేశ నిర్ణయాలను ఏ మేరకు అమలు చేశారనే అంశమై మండలాల వారీగా సమీక్షించారు. పురోగతిలో ఉన్న పలు భూ సమస్యలను నిర్దేశించిన వ్యవధిలోపు పరిష్కరించాలని ఆదేశించారు. సాదాబైనామా, ఇనామ్ భూములు తదితర భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు వ్యక్తిగత శ్రద్ధతో పనిచేయాలని సూచించారు. అనంతరం మేకపాటి విక్రమ్‌రెడ్డి మాట్లాడారు. నియోజకవర్గంలోని మండలాల్లో నూతనంగా నియమితులైన తహసీల్దార్లు భూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఆత్మకూరు ఆర్డీఓ మధులత, సర్వే అధికారి హనుమాన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సమస్యలపై సమీక్షిస్తున్న కలెక్టర్ హరినారాయణన్, ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లాలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలను పటిష్టంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ను విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్, విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ నిర్వహించారు. సమావేశానికి కలెక్టరేట్ నుంచి వర్చువల్‌గా హాజరైన కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో 81 కేంద్రాల్లో నిర్వహించనున్న ఇంటర్మీడియల్ పరీక్షలకు 52,076 మంది హాజరుకానున్నారని, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామని వివరించారు. జిల్లాలోని 176 కేంద్రాల్లో నిర్వహించనున్న పదో తరగతి పరీక్షలకు 32,834 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, పది ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. కేంద్రాల్లో వసతుల పరిశీలనకు మున్సిపాల్టీలు, మండల కేంద్రాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలకు గంట ముందుగానే విద్యార్థులు చేరుకునేలా బస్సులను ఏర్పాటు ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. ఆర్ఐఓ శ్రీనివాసులు, డీఈఓ రామారావు, ఒకేషనల్ విద్యాధికారి వరప్రసాద్, డీఎంహెచ్ఓ పెంచలయ్య, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఎస్పీడీసీఎల్ ఎస్ఈ విజయన్, పోస్టల్ అధికారి రాజేష్, అదనపు మున్సిపల్ కమిషనర్ శర్మద తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ హాల్ కోసం పరిశీలన



ప్రియదర్శిని కళాశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరంలోని కనుపర్తిపాడు ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్ ఏర్పాటుకు గల అవకాశాలను నెల్లూరు సిటీ నియోజకవర్గ ఈఆర్వో, కమిషనర్ వికాస్‌మర్మత్ పలువురు అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఈవీఎం మెషీన్లను భద్రపర్చేందుకు, ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించేందుకు కళాశాల భవనంలోని సౌకర్యాలను కమిషనర్ పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్ఓ లవన్న, కోవూరు ఈఆర్వో శ్రీనివాసులు, సిటీ ప్లానర్ దేవీకుమారి, ఎస్ఈ సంపత్‌కుమార్, డీఈ ప్రసాద్, సర్వేయర్ సోమేశ్వరరావు, మాధవి, ఏఈ అర్పిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయం మరింత స్మార్ట్‌గా..

సాంకేతికతను ఎస్పీడీసీఎల్ అందిపుచ్చుకుంటోంది. జిల్లాలోని వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ కసరత్తు చేస్తోంది. వీటి ద్వారా నష్టాలకు చెక్ పెట్టడంతో పాటు రైతులపై ఎలాంటి భారం పడకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వం అందజేసే సబ్సిడీని సైతం తెలుసుకోవడం ఇందులో ప్రత్యేకత.

- విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్లు
- రైతులపై ఎలాంటి భారం ఉండదు
- ప్రభుత్వం అందించే సబ్సిడీని తెలుసుకోవచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పంటల సాగులో తలమునకలయ్యే రైతన్నల సంక్షేమం కోసం ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోంది. ఇందులో భాగంగా విద్యుత్ మోటార్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. వీటితో రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లే అవకాశం లేదు. విద్యుత్ నష్టాలను అరికట్టి సరఫరా వ్యయాన్ని తగ్గించేందుకు ఆస్కారం కలగనుంది. ఎనర్జీ ఆడిటింగ్, అకౌంటింగ్ చేసేందుకు వీలుపడుతుందనే ఉద్దేశంతో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించి.. ఈ మేరకు అన్ని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది.

అపోహలకు ఆస్కారం అక్కర్లేదు

జిల్లాలో 2,16,732 వ్యవసాయ విద్యుత్ సర్వీసులున్నాయి. ఉచిత విద్యుత్ పథకానికి ఎంత మేర వినియోగిస్తున్నారనే అంశంతో పాటు సబ్సిడీ రూపంలో ఎంత మొత్తం చెల్లించాలనే సమాచారాన్ని స్మార్ట్ మీటర్ల ద్వారా సమగ్రంగా తెలుసుకునేందుకు వీలు కలుగుతుంది. విద్యుత్ ప్రమాదాల నుంచి రైతులను రక్షించేందుకు వీలుగా అలైడ్ మెటీరియల్‌ను ఉచితంగా అందజేయనున్నారు. ఈ ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ఈ తరుణంలో రైతులు, విద్యుత్ సంస్థలపై ఎలాంటి భారం పడదు. స్మార్ట్ మీటర్ ఏర్పాటులో ఎలాంటి సందేహాలు పడాల్సిన అవసరం లేదని విద్యుత్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

పొలాలకు వెళ్లకుండానే మోటార్లు ఆన్


స్మార్ట్ మీటర్ల ఏర్పాటు సమయంలో వ్యవసాయ విద్యుత్ వినియోగదారుడి ఫోన్‌ను అనుసంధానం చేయనున్నారు. దీంతో ఏ ప్రదేశంలో ఉన్నా ఫోన్ ద్వారానే మోటార్‌ను ఆఫ్ లేదా ఆన్ చేసుకునేందుకు అవకాశం ఏర్పడనుంది. స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ చౌర్యాన్ని అరికట్టడంతో పాటు సరఫరా అయ్యే సమయాన్ని తెలుసుకోవచ్చు. విద్యుత్ నాణ్యత.. వినియోగంలో కచ్చితత్వాన్ని తెలుసుకోవచ్చు.



స్మార్ట్ మీటర్

జిల్లాలో వ్యవసాయ విద్యుత్ సర్వీసులు	రోజువారీ వినియోగం (యూనిట్లలో)
2,16,732	58.51 లక్షలు
నెలవారీగా - 17.55 కోట్ల యూనిట్లు	

అవగాహన కల్పిస్తున్నాం



జిల్లాలోని వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నాం. స్మార్ట్ మీటర్లపై కొందరు రైతుల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నాం. స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగవు.. పైగా ఒక్క పైసా ఖర్చు ఉండదు.

– విజయన్, ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ

నిర్లక్ష్యం పరాకాష్టకు..

విద్యారంగ పటిష్టతకు రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లలో నిధులను వెచ్చిస్తున్నా, ఆ శాఖ నిర్లక్ష్యాన్ని వీడటంలేదు. ప్రభుత్వం నిర్దేశించిన విధులను నిర్వర్తించడంలో కొందరు ఉపాధ్యాయులతో పాటు జిల్లా విద్యాశాఖ అధికారులు నిర్లిప్త ధోరణిని అవలంబిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విధి నిర్వహణలో అలసత్వం వహించిన 338 మంది ప్రధానోపాధ్యాయులకు డీఈఓ మూడు రోజుల క్రితం షోకాజ్ నోటీసులను జారీ చేయడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

- ఉపాధ్యాయులు, అధికారుల అలసత్వం
- సకాలంలో విద్యార్థుల హాజరు నమోదులో నిర్లిప్తత
- మిడ్‌డే మీల్స్, టాయ్‌లెట్ల ఫొటోల అప్‌లోడ్‌లోనూ అంతే..
- జిల్లాలో 338 మంది హెచ్ఎంలకు షోకాజ్ నోటీసులు

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో విద్యావ్యవస్థ కోసం ప్రభుత్వం భారీగా నిధులను వెచ్చిస్తున్నా, ఉపాధ్యాయులు, అధికారులు అలసత్వం వహిస్తున్నారు. కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాడు – నేడు ద్వారా మౌలిక వసతులను కల్పించి ఎంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందేలా రోజుకో తరహాలో మెనూను అమలు చేస్తున్నారు. ఇన్ని చేస్తున్నా, ఉపాధ్యాయులు, అధికారులు తమకేమీ పట్టదనే రీతిలో వ్యవహరిస్తున్నారు.

జిల్లాలో 2,575 పాఠశాలలు

జిల్లాలో 2,027 ప్రాథమిక, 254 ప్రాథమికోన్నత, 294 ఉన్నత.. ఇలా మొత్తం 2,575 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 2.82 లక్షల మందికిపైగా విద్యార్థులు చదువుతుండగా, తొమ్మిది వేల మందికిపైగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అయితే కొన్ని అంశాల్లో ఉపాధ్యాయుల నిర్లక్ష్యం కనిపిస్తోంది.

సమాధానాలు కరువు..

కందుకూరు డివిజన్లోని పలు పాఠశాలలను విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ గతేడాది నవంబర్‌లో సందర్శించారు. సిలబస్ పూర్తయిన పాఠ్యాంశాల్లో కొన్ని ప్రశ్నలను ఆయన సంధించగా, ఏ విద్యార్థి నుంచీ సమాధానం రాలేదు. ఇంగ్లిష్ పుస్తకాన్ని చదవమని నాలుగో తరగతి విద్యార్థిని అడగ్గా, నోరెళ్లబెట్టిన విషయం తెలిసిందే. ఈ తరుణంలో అక్కడ పనిచేస్తున్న పలువురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులనూ జారీ చేశారు. అయినా అనేక చోట్ల పద్ధతిలో ఎలాంటి మార్పు రాలేదు.

షోకాజ్ నోటీసులతో కలవరం

విధుల్లో నిర్లక్ష్యం వహించారనే కారణంగా జిల్లాలోని 338 మంది పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు షోకాజ్ నోటీసులను డీఈఓ రామారావు మూడో రోజుల క్రితం జారీ చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని సకాలంలో వేయలేదనే కారణంతో 175 మందికి.. మధ్యాహ్న భోజనాన్ని తినడంలో విద్యార్థుల సంఖ్య తగ్గడం, భోజనం చేస్తున్న వారి ఫొటోలను ఆన్‌లైన్లో అప్‌లోడ్ చేయడం, తదితరాల్లో అలసత్వం వహించిన 163 మంది ప్రధానోపాధ్యాయులకు నోటీసులను పంపారు. సకాలంలో వివరణ పంపాలని అందులో పేర్కొన్నారు.

పర్యవేక్షణ శూన్యం

వాస్తవానికి ప్రతి మండలంలో ఇద్దరు ఎంఈఓలు ఉన్నారు. నెల్లూరు, కావలి, కందుకూరు డివిజన్లకు ముగ్గురు డిప్యూటీ డీఈఓలు ఉన్నారు. వీరు ఆయా పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాల్సి ఉంది. అయితే వీరు తనిఖీ చేసిన సందర్భాలు అరుదుగా మారాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని ఇద్దరు ఎంఈఓలు బోధనతో పాటు బోధనేతర పనులను పర్యవేక్షించాల్సి ఉంది. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ సిలబస్, టోఫెల్ శిక్షణ, డిజిటల్ బోధన, 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు, ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్పీలను అందజేసి.. విద్యార్థులకు బోధించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికైనా సక్రమంగా పర్యవేక్షించి మెరుగైన విద్యాబోధన అందేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బోధనతో పాటు కొన్ని విధులు..

ప్రభుత్వ పాఠశాలల్లో బోధనతో పాటు కొన్ని రకాల విధులను నిర్వర్తించాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. రోజూ ఉదయం 8.30 నుంచి తొమ్మిది గంటల్లోపు టాయ్‌లెట్లు, టీచర్ల హాజరు.. 9.30లోపు విద్యార్థుల హాజరుశాతాన్ని ఆన్‌లైన్లో నమోదు చేయాల్సి ఉంది. ఉదయం 11 గంటలకు మధ్యాహ్న భోజన మెనూ ఇండెంట్, ఒంటి గంటలోపు విద్యార్థులు భోజనం చేస్తున్న ఫొటోలను సంబంధిత యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు 3.30లోపు, హైస్కూల్ ఉపాధ్యాయులు నాలుగులోపు హాజరు వేయాలి. వీటన్నింటినీ ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పర్యవేక్షించాల్సి ఉంటుంది.



నోటీసులు పంపాం



ప్రధానోపాధ్యాయులకు నోటీసులు పంపింది వాస్తవమే. వీరిని అప్రమత్తం చేసేందుకే పంపాం. నెట్‌వర్క్ సమస్యతో హాజరును వేయలేకపోయామని వారు చెప్తున్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలను ప్రతి పాఠశాలలో ఉపాధ్యాయులు, హెడ్‌మాస్టర్లు నిర్వర్తించాల్సి ఉంది. ఇందులో ఎవరికీ మినహాయింపు ఉండదు.

– రామారావు, డీఈఓ

‘ఓటడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది’

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: ‘సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారు. అభివృద్ధి పనులు చేయించారు. దీంతో వచ్చే ఎన్నికల్లో ఓటడిగే హక్కు వైఎస్సార్‌సీపీకే ఉంది’ అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరులోని రుక్మిణి కల్యాణ మండపంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లంచాలు, వివక్షకు తావు లేకుండా పేదలకు వలంటీర్ల ద్వారా పథకాలను అందజేస్తున్నట్లు చెప్పారు. అనేక రాష్ట్రాలు ఈ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు ప్రజలను దోచుకున్నాయని విమర్శించారు. ఆ కమిటీలు గంజాయి మొక్కలైతే.. సచివాలయాలు తులసి మొక్కలన్నారు. జగన్‌ ప్రభుత్వంలో పేదలకు సేవ చేయడానికి వలంటీర్, సచివాలయ వ్యవస్థలు పుట్టాయన్నారు. చంద్రబాబు నాయుడు, బీజేపీ, పవన్‌ కళ్యాణ్‌ ఒక్కటైనా సీఎం జగన్‌ ఒంటరిగానే ఎన్నికలకు వెళ్తున్నట్లు తెలిపారు. ఆయన గెలుపును వాళ్లు అడ్డుకోలేరన్నారు.


వలంటీర్‌కు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వలంటీర్లకు పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి సభ్యుడు నిరంజన్‌బాబురెడ్డి, రజత్‌కుమార్‌రెడ్డి, కోవూరు ఏఎంసీ చైర్మన్‌ రాధాకృష్ణారెడ్డి, మండల కన్వీనర్‌ సుబ్బారెడ్డి సొసైటీ చైర్మన్‌ మల్లికార్జునరెడ్డి, ఎంపీపీ పార్వతి జెడ్పీటీసీ శ్రీలత, ఎంపీడీఓ రామాంజనేయులు, తహసీల్దార్‌ విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్‌ ధరలు



బ్రాయిలర్‌ (లైవ్‌)	: 152
లేయర్‌ (లైవ్‌)	: 80
బ్రాయిలర్‌ చికెన్‌	: 266
బ్రాయిలర్‌ స్కిన్‌లెస్‌	: 294
లేయర్‌ చికెన్‌	: 136

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.80
సన్నవి	: రూ.70
పండ్లు	: రూ.25

3.85 కిలోల గంజాయి స్వాధీనం

ముత్తుకూరు: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఓ వ్యక్తిని సెబ్‌ అధికారులు అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలో జరిగింది. ఇందుకూరుపేట సీఐ శ్రీనివాసులు గురువారం వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన సాహు అనే వ్యక్తి వద్ద 3.85 కిలోల గంజాయి ఉన్నట్లు సెబ్‌ అధికారులకు సమాచారం అందింది. బుధవారం రాత్రి ఈపూరు బస్‌ షెల్టర్‌ వద్ద అతడిని అదుపులోకి తీసుకున్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం


పురస్కారాలు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే రామిరెడ్డి

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అల్లూరు: ‘వలంటీర్లు పేదలకు సంక్షేమ పథకాలను పక్కాగా అందిస్తున్నారు. వారి సేవలు ప్రశంసనీయం’ అని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్‌ కార్యాలయంలో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఇందులో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్‌ వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజలకు అండగా నిలిచారని కొనియాడారు. ప్రతి పథకాన్ని అర్హులకు చేర్చడంలో వారు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. అనంతరం వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు నీలం సాయికుమార్, రూరల్‌ కన్వీనర్‌ బీద రమేష్, నాయకులు ఉస్మాన్, కె.శ్రీను, మేడా శ్రీనివాసులురెడ్డి, మధురెడ్డి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు


రాఘవులుకు వైఎస్సార్‌సీపీ కండువా కప్పిన ఎమ్మెల్యే మేకపాటి

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్‌: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందాయని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని గండ్లవీడు తెలుగుదేశం పార్టీ నాయకుడు ఉలవ రాఘవులు గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతోందన్నారు. విక్రమ్‌రెడ్డి నియోజకవర్గంలో ప్రజా సంక్షేమ పనులు చేస్తున్నారని, వారిని చూసి వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్‌ కన్వీనర్‌ డాక్టర్‌ సీహెచ్‌ ఆదిశేషయ్య, కొల్లి దొరస్వామినాయుడు, ధనాల రమేష్‌ నాయుడు, శ్రీనివాసులురెడ్డి, సయ్యద్‌ జమీర్‌బాష తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా పది పబ్లిక్‌ పరీక్షలు

- డీఈఓ రామారావు

నెల్లూరు(టౌన్‌): పదో తరగతి పబ్లిక్‌ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. నెల్లూరు డివిజన్‌కు చెందిన చీఫ్‌ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్‌ అధికారులు, ప్రధానోపాధ్యాయులకు నెల్లూరు సరస్వతి నగర్‌లోని ఐఎంఏ హాల్‌లో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పరీక్షలకు సంబంధించిన యాక్ట్‌–25 గురించి క్షుణ్ణంగా తెలుసుకుని నిబంధనలను పాటించాలన్నారు. వచ్చే నెల 9, 10, 11 తేదీల్లో పరీక్షల ప్రశ్నపత్రాలు వస్తాయన్నారు. స్కూల్‌ కాంప్లెక్స్‌లను హెడ్‌మాస్టర్లు బలోపేతం చేయాలన్నారు. ఇప్పటి వరకు ఎంఈఓలు సూపర్‌వైజింగ్‌ చేస్తున్నారని, ఇకనుంచి హెచ్‌ఎంలు మానిటరింగ్‌ చేసి ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓ, డీఈఓలకు రిపోర్టులు పంపాలన్నారు. నియోజకవర్గాల వారీగా స్కూల్‌ కాంప్లెక్స్‌ హెడ్‌మాస్టర్లను గ్రూపులుగా చేసి వారానికి ఒకసారి టెలీకాన్ఫరెన్స్, క్షేత్రస్థాయి పరిశీలన చేస్తానని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి, పరీక్షల విభాగం అసిస్టెంట్‌ కమిషనర్‌ అసదుల్లా ఖాన్, డీసీఈబీ సెక్రటరీ రామ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఈఓ రామారావు

సీఎం జగన్‌ వైపే రాష్ట్ర ప్రజానీకం


వలంటీర్‌ను సన్మానిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి, ఖలీల్‌ అహ్మద్‌

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే రాష్ట్ర ప్రజానీకం జై కొడుతోందని టీచర్స్‌ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 39, 40, 42, 43, 44, 47, 48, 49, 50, 51, 52, 53, 54 డివిజన్ల వలంటీర్లకు పురస్కారాల అందజేత కార్యక్రమం స్థానిక విరాట్‌ నగర్‌లో వీబీఎస్‌ కల్యాణ మండపంలో గురువారం జరిగింది. చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సిటీ సమన్వయకర్త ఎండీ ఖలీల్‌ అహ్మద్, మేయర్‌ పొట్లూరి స్రవంతి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సచివాలయ, వలంటీర్‌ వ్యవస్థలు దేశానికే రోల్‌ మోడల్‌ అన్నారు. అనిల్‌ కుమార్‌ నగర నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశారన్నారు. అయితే గత ప్రభుత్వంలో ఎన్నో పనులు చేశామని టీడీపీ నాయకుడు నారాయణ చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. అభివృద్ధిపై అనిల్‌ ఆధ్వర్యంలో చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. మేయర్‌ మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందించడంలో ప్రతి వలంటీర్‌ సేవలను అభినందించారు. ఖలీల్‌ అహ్మద్‌ మాట్లాడుతూ ఎమ్మెల్యే అనిల్‌ చేసిన సేవలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్‌ కరిముల్లా, నీలి రాఘవ, పొట్లూరి రామకృష్ణ ఆచారి, వందవాసి రాజేశ్వరి, గుంజి జయలక్ష్మి, కాయల సాహిత్య, దేవరకొండ సుజాత, షేక్‌ సఫియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వానికి మద్దతుగా నిలవండి

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

దుత్తలూరు: మంచి చేస్తున్న ప్రజా ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ మద్దతుగా నిలిచి మరోసారి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి కోరారు. మండలంలోని కొత్తపేట, వెంగనపాళెం, తిమ్మాపురం గ్రామాల్లో ఆయన గురువారం విజయ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచే ఎన్నికల హామీలను నెరవేర్చారన్నారు. ప్రతి పేదవాడు ఆర్థికంగా బలపడాలన్నదే ఆయన లక్ష్యమన్నారు. ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. భవిష్యత్‌లో పేదలకు మరింత మేలు జరగాలంటే జగనన్న అవసరం ఎంతో ఉందన్నారు. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. కొత్తపేట ఎస్సీ కాలనీలో వాటర్‌ప్లాంట్‌ కావాలని అడగ్గా ఏర్పాటు చేయిస్తామన్నారు. అలాగే వెంగనపాళెం – తిమ్మాపురం రోడ్డును బాగు చేయిస్తామన్నారు. సచివాలయ నిధుల ద్వారా సిమెంట్‌ రోడ్లను నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ, సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, జేసీఎస్‌ మండల కన్వీనర్‌ అన్నంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌ తిప్పిరిబోయిన వెంగయ్య, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్‌ దేవరపాటి సురేంద్ర, నాయకులు ఎల్‌పీ కొండారెడ్డి, అలీ అహ్మద్‌ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజగోపాల్‌రెడ్డి

బస్సు నడుపుతుండగా..

- అనారోగ్యానికి గురైన డ్రైవర్‌

మర్రిపాడు: బద్వేల్‌ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్‌ గంగయ్య గురువారం బస్సు నడుపుతూ అనారోగ్యానికి గురయ్యాడు. ఈ క్రమంలో వాహనాన్ని మర్రిపాడు సెంటర్‌లో నిలిపి కుప్పకూలిపోయాడు. స్థానికులు గుర్తించి హాస్పిటల్‌కు తరలించి చికిత్స చేయించారు. తనకు ఇటీవల గుండె ఆపరేషన్‌ జరిగిందని, గురువారం తెల్లవారుజాము నుంచి జ్వరం ఉందని, సెలవు కావాలని అధికారులను కోరానని గంగయ్య చెప్పారు. వారు సెలవు నిరాకరించడంతో విధులకు వచ్చానన్నారు. బస్సులో 30 మంది ప్రయాణికులున్నారు. వారిని వేరే వాహనంలో తరలించారు. గంగయ్య బస్సును ఆపేయడంతో ప్రమాదం తప్పింది.


చికిత్స పొందుతున్న డ్రైవర్‌

IV
సాక్షి బిజినెస్
శుక్రవారం
23-2-2024

స్టాక్‌ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	535	73,158
నిఫ్టీ ▲	162	22,217

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,960	▲ 379
డోజోన్స్	38,878	▲ 265
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	▲ 22
డాక్స్	17,370	▲ 252
షాంఘై	2,988	▲ 37
నికాయ్	39,099	▲ 836

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)	62,155	▼ 103
బంగారం (99.5 స్వచ్ఛత)	61,906	▼ 103
వెండి (కేజీ)	70,396	▼ 312

ఫారెక్స్‌ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.51	83.53
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	103.62	106.16
€	యూరో	ఎస్‌బీఐ	88.61	90.97
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	54.76	56.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.58	55.50
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.41	64.01
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.22	22.79
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.96	23.49
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.42	12.49

మారుత్ డ్రోన్స్‌కు తొలి యుటిలిటీ పేటెంట్

డ్రోన్ల సాయంతో వరిసాగు

హైదరాబాద్: మారుత్ డ్రోన్స్ ప్రపంచంలోనే తొలి యుటిలిటీ పేటెంట్‌ను (మేధో సంపత్తి హక్కు) 20 ఏళ్ల కాలానికి సొంతం చేసుకుంది. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ వర్సిటీ (పీజేటీఎస్ఏయూ) సహకారంతో మారుత్ డ్రోన్స్ అభివృద్ధి చేసిన డైరెక్ట్ సీడింగ్ డ్రోన్‌కు ఈ పేటెంట్ దక్కింది. క్షేత్రస్థాయిలో వరిసాగు కోసం డైరెక్ట్ సీడింగ్ డ్రోన్లను విస్తృతంగా వినియోగించే దిశగా పనిచేయనున్నట్టు సంస్థ ప్రకటించింది. 2030 నాటికి మిలియన్ హెక్టార్లలో విత్తు నాటాలన్న లక్ష్యాన్ని సంస్థ నిర్దేశించుకున్నట్లు మారుత్ డ్రోన్స్ వ్యవస్థాపకుడు, సీఈవో ప్రేమ్ కుమార్ విస్లావత్ తెలిపారు.



మూడేళ్లలో రూ. 10 వేల కోట్ల ఆదాయం

డెకరేటివ్ పెయింట్స్ వ్యాపారంలోకి ఆదిత్య బిర్లా గ్రూప్



న్యూఢిల్లీ: కొత్త వెంచర్ అయిన డెకరేటివ్ పెయింట్స్ వ్యాపార విభాగం నుంచి వచ్చే మూడేళ్లలో రూ. 10,000 కోట్ల ఆదాయాన్ని అంచనా వేస్తున్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా తెలిపారు. అప్పటికల్లా లాభాల్లోకి మళ్లగలమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బిర్లా ఓపస్ బ్రాండ్ కింద డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంతో పాటు మూడు పెయింట్ ప్లాంట్లను గురువారం ఆయన ప్రారంభించారు. పానిపట్ (హరియాణ), లూధియానా (పంజాబ్), చెయ్యార్ (తమిళనాడు)లో ఈ ప్లాంట్లు ఉన్నాయి. బిర్లా ఓపస్ పెయింట్లు మార్చి నుంచి పంజాబ్, హరియాణ, తమిళనాడులో లభ్యమవుతాయి. జూలై నుంచి 1 లక్షకు పైగా జనాభా ఉన్న పట్టణాల్లో ఇవి లభిస్తాయని బిర్లా చెప్పారు. ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 6,000 పట్టణాలకు కార్యకలాపాలు విస్తరించాలని నిర్దేశించుకున్నట్లు వివరించారు. గ్రూప్‌లో కీలకమైన గ్రాసిమ్ ఇండస్ట్రీస్ గతేడాది డెకరేటివ్ పెయింట్ల వ్యాపారంలోకి అడుగు పెడుతున్నట్లు ప్రకటించింది. 2025 నాటికి రూ. 10,000 కోట్లతో దేశీయంగా ఆరు తయారీ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే రూ. 5,000 కోట్లు వెచ్చించినట్లు బిర్లా ఓపస్ బిజినెస్ హెడ్ హిమాంశు కపానియా తాజాగా చెప్పారు. దేశీయంగా డెకరేటివ్ పెయింట్స్ మార్కెట్ దాదాపు రూ. 80,000 కోట్ల స్థాయిలో ఉంది. ఏషియన్ పెయింట్స్, బర్జర్ పెయింట్స్, నెరోలాక్, అక్జో నోవెల్ (డ్యూలక్స్) ఈ విభాగంలో దిగ్గజాలుగా ఉన్నాయి.

వొడాఫోన్ ఐడియా నిధుల బాట

- ఈ నెల 27న బోర్డు సమావేశం
- కంపెనీ బలిమికి కట్టుబాటు
- కుమార మంగళం బిర్లా వెల్లడి

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం దిగ్గజం వొడాఫోన్ ఐడియా నిధుల సమీకరణకు ప్రతిపాదించింది. ఈ అంశంపై చర్చించేందుకు కంపెనీ బోర్డు ఈ నెల 27న సమావేశం కానున్నట్లు కంపెనీ పేర్కొంది. నిధుల సమీకరణకున్న అన్ని అవకాశాలను బోర్డు పరిశీలించనున్నట్లు తెలియజేసింది. రైట్స్, పబ్లిక్ ఆఫర్, ప్రిఫరెన్షియల్ కేటాయింపులు, క్విప్ తదితర మార్గాలతోపాటు.. ఒకేసారి లేదా దశలవారీగా నిధుల సమీకరణకు తెరతీసే అంశంపై నిర్ణయించనున్నట్లు వివరించింది. వెరసి ఈక్విటీ లేదా రుణ మార్గాలలో నిధుల సమీకరణ చేపట్టనున్నట్లు బీఎస్ఈకి వొడాఫోన్ ఐడియా తాజాగా వెల్లడించింది.



విదేశీ ఇన్వెస్టర్లకు చోటు

నగదు సవాళ్లను ఎదుర్కొంటున్న వొడాఫోన్ ఐడియా కంపెనీ బలిమికి కట్టుబడి ఉన్నట్లు ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమారమంగళం బిర్లా తాజాగా స్పష్టం చేశారు. బిర్లా గ్రూప్ డెకరేటివ్ పెయింట్ల బిజినెస్‌లోకి ప్రవేశిస్తున్న సందర్భంగా వొడాఫోన్‌లో విదేశీ ఇన్వెస్టర్లకు చోటు కల్పించేందుకు పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్లు తెలియజేశారు. అయితే బోర్డులో విదేశీ ఇన్వెస్టర్లు ఎప్పుడు ప్రవేశిస్తారన్న అంశంపై ఇప్పుడే చెప్పలేమన్నారు. ఇందుకు వ్యూహాత్మకంగా తగిన ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. వొడాఫోన్ ఐడియాలో ఆదిత్య బిర్లా గ్రూప్ సహప్రమోటర్‌గా ఉన్న సంగతి తెలిసిందే. కాగా.. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో కంపెనీ రూ. 6,986 కోట్లకు నికర నష్టాన్ని తగ్గించుకుంది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 7,990 కోట్ల నష్టం ప్రకటించింది. దాదాపు రూ. 756 కోట్ల అనూహ్య లాభాలు నష్టాలు తగ్గేందుకు సహకరించాయి. భారీ రుణ భారాన్ని మోస్తున్న వొడాఫోన్ ఐడియా మొబైల్ టెలికం రంగంలోని ప్రత్యర్థి సంస్థలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటోంది.

నిధుల సమీకరణ వార్తలతో వొడాఫోన్ ఐడియా షేరు బీఎస్ఈలో 6.3 శాతం జంప్‌చేసి రూ. 16.30 వద్ద ముగిసింది.

-542 నుంచి +535

కనిష్టాల నుంచి మార్కెట్ ర్యాలీ

- నాలుగో రోజు నిఫ్టీ సరికొత్త రికార్డు
- ట్రేడింగ్‌లో భారీ ఒడిదుడుకులు

ముంబై: మిడ్‌సెషన్ నుంచి ఆటో, ఐటీ, టెక్నాలజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు గురువారం కనిష్ఠ స్థాయిల నుంచి బౌన్స్ బ్యాక్ అయ్యాయి. యూరో జోన్ తయారీ, సేవా రంగ పీఎంఐ డేటా అంచనాలకు మించి నమోదవడంతో పాటు అమెరికా టెక్ కంపెనీల క్యూ3 ఆర్థిక ఫలితాలు మెప్పించడం దేశీయ ఈక్విటీ మార్కెట్ల రికవరీ ర్యాలీకి తోడ్పాటు అందించాయి. ఉదయం స్తబ్దుగా ట్రేడింగ్ ప్రారంభించిన సూచీలు రోజంతా తీవ్ర ఊగిసలాటకు లోనయ్యాయి. ఇంట్రాడేలో 542 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 535 పాయింట్ల లాభంతో 73,158 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 1176 పాయింట్ల రేంజ్‌లో 72,081 వద్ద కనిష్టాన్ని, 73,256 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ 180 పాయింట్ల నష్టం తేరుకొని 162 పాయింట్లు బలపడి 22,217 వద్ద స్థిరపడింది. ఒక దశలో 197 పాయింట్లు పెరిగి వరుసగా నాలుగోరోజూ 22,252 వద్ద జీవితకాల గరిష్టాన్ని లిఖించింది. ఈ సూచీకి ముగింపు(22,217)కూడా కొత్త రికార్డు కావడం విశేషం. ఆటో, ఐటీతో పాటు క్యాపిటల్ గూడ్స్, పారిశ్రామిక, విద్యుత్ రంగాల షేర్లు రాణించాయి. ప్రభుత్వ, ప్రైవేటు రంగ బ్యాంకులు షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.92%, 0.54% చొప్పున లాభపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,410 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,824 కోట్ల షేర్లు కొన్నారు. ఆసియాలో ఇండోనేసియా మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు 2% వరకు ర్యాలీ చేశాయి. యూరప్‌లో ఫ్రాన్స్, జర్మనీ ఎక్స్ఛేంజీలు 1.50% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు 2% లాభాల్లో ట్రేడవుతున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) సీజన్‌లో చెరకు కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.25 మేర పెంచుతున్నట్లు ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకోవడంతో చక్కెర ధరలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్ఈలో రానా షుగర్స్, మవాన షుగర్స్, శ్రీ రేణుక షుగర్స్, దాల్మియా షుగర్స్, భరత్ షుగర్ అండ్ ఇండస్ట్రీస్, ఈఐడీ ప్యారీ షుగర్స్ షేర్లు 3% – 1% చొప్పున నష్టపోయాయి.



డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలపడి 82.85 వద్ద స్థిరపడింది.

కొత్త చందాదారుల ఆకర్షణలో జియో టాప్

డిసెంబర్‌లో 40 లక్షల కస్టమర్లు • ఎయిర్‌టెల్‌లోకి 18.5 లక్షలు • 119 కోట్లకు టెలికం చందాదారులు



న్యూఢిల్లీ: కొత్త కస్టమర్లను ఆకర్షించడంలో మరోసారి రిలయన్స్ జియో ముందుంది. 2023 డిసెంబర్ నెలకు గాను 39.94 లక్షల మొబైల్ చందాదారులను జియో సొంతం చేసుకుంది. భారతీ ఎయిర్‌టెల్ కిందకు కొత్తగా 18.5 లక్షల మంది కస్టమర్లు వచ్చి చేరారు. అదే సమయంలో ఎప్పటి మాదిరే వొడాఫోన్ ఐడియా మరో 13.68 లక్షల కస్టమర్లను డిసెంబర్‌లో కోల్పోయింది. ప్రభుత్వరంగ బీఎస్ఎన్ఎల్ 1.5 లక్షల కస్టమర్లు, ఎంటీఎన్ఎల్ 4,420 మంది కస్టమర్ల చొప్పున నష్టపోయాయి. మొత్తం టెలికం చందాదారులు 2023 నవంబర్ నాటికి 1,185.73 మిలియన్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 1,190.33 మిలియన్లకు (119 కోట్లకు) చేరారు. నెలవారీగా ఇది 0.39 శాతం వృద్ధికి సమానం. బ్రాడ్‌బ్యాండ్ చందాదారులు సైతం 90.4 కోట్లకు పెరిగారు. వైర్‌లైన్ టెలిఫోన్ చందాదారుల సంఖ్య నవంబర్ చివరికి 3.15 కోట్లుగా ఉంటే, డిసెంబర్ చివరికి 3.18 కోట్లకు పెరిగింది. వైర్‌లైన్ విభాగంలో జియో 2.46 లక్షల కొత్త కస్టమర్లను సాధించింది. ఎయిర్‌టెల్ 82,317 మంది, వొడాఫోన్ ఐడియా 9,656, క్వాండ్రంట్ 6,926 కస్టమర్ల చొప్పున సొంతం చేసుకున్నాయి. బీఎస్ఎన్ఎల్ 34,250 మంది, టాటా టెలిసర్వీసెస్ 22,628 మంది చొప్పున కస్టమర్లను కోల్పోయాయి.

సి.ఎం.ఆర్. ప్రచారకర్తగా మృణాల్ ఠాకూర్

హైదరాబాద్: ప్రముఖ వస్త్ర స్వర్ణాభరణాల సంస్థ సి.ఎం.ఆర్.షాపింగ్ మాల్ నూతన బ్రాండ్ అంబాసిడర్‌గా సినీ నటి మృణాల్ ఠాకూర్ నియమితులయ్యారు. తెలుగువారి ప్రతి వేడుకలో భాగమైన సి.ఎం.ఆర్.కు ప్రచారకర్తగా ఎంపిక కావడం సంతోషంగా ఉందని మృణాల్ ఠాకూర్ ఈ సందర్భంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. శుభ కార్యాలకు ప్రత్యేక పట్టువస్త్రాలు, యువత మెచ్చే సరికొత్త ఫ్యాషన్స్, అద్భుతమైన డిజైన్లతో కిడ్స్ వేర్ కలెక్షన్స్ ఇక్కడ లభిస్తాయన్నారు. ''మృణాల్ ఠాకూర్ మా సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండటం సంతోషంగా ఉంది. ప్రపంచ స్థాయి ఫ్యాషన్ ట్రెండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు సరికొత్త కలెక్షన్స్ మా వద్ద లభిస్తాయి'' అని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలాజీ తెలిపారు



అశోక్ లేలాండ్ @ 30 లక్షలు



చెన్నై: హిందూజా గ్రూప్ కంపెనీ, వాణిజ్య వాహనాల తయారీలో ఉన్న అశోక్ లేలాండ్ సరికొత్త మైలురాయిని చేరుకుంది. ఉత్తరాఖండ్‌లోని పంత్‌నగర్ వద్ద ఉన్న కంపెనీ ప్లాంటు మొత్తం 30 లక్షల యూనిట్లను తయారు చేసి కొత్త రికార్డు సృష్టించింది. అత్యంత విశ్వసనీయ ఉత్పత్తులను తయారు చేయడంలో, అగ్రశ్రేణి కస్టమర్ సేవలను అందించడంలో సుస్థిర ఖ్యాతికి ఈ మైలురాయి నిదర్శనం అని అశోక్ లేలాండ్ ఎండీ, సీఈవో శేణు అగర్వాల్ గురువారం తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

23-2-2024	
విశాఖ	525–00
చిత్తూరు	603–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	515–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
22-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	534–00
వరంగల్	536–00
రిటైల్ ధర	5.95

సాక్షి స్పోర్ట్స్



ఐపీఎల్ నుంచి షమీ అవుట్

భారత పేస్ బౌలర్ షమీ ఎడమ కాలి మడమ గాయం కారణంగా ఐపీఎల్–2024 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. గత నెలలో లండన్‌లో ఈ గాయానికి చికిత్స తీసుకునే క్రమంలో మడమకు అతను ప్రత్యేక ఇంజక్షన్‌లు తీసుకున్నాడు. అయితే అవి ప్రభావం చూపించకపోవడంతో శస్త్ర చికిత్స చేయించుకోవడం తప్పనిసరిగా మారింది. త్వరలోనే అతను మళ్లీ లండన్‌కు వెళతాడు. వన్డే వరల్డ్ కప్‌లో 24 వికెట్లతో భారత్‌ను ఫైనల్ చేర్చడంలో కీలక పాత్ర పోషించిన షమీ ఆ తర్వాత మరే మ్యాచ్‌లోనూ బరిలోకి దిగలేదు.

నేటి నుంచి రంజీ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్స్

రంజీ ట్రోఫీ క్రికెట్ టోర్నీ ఎలైట్ డివిజన్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు శుక్రవారం మొదలుకానున్నాయి. ఇండోర్‌లో మధ్యప్రదేశ్‌తో ఆంధ్ర జట్టు... ముంబైలో బరోడాతో ముంబై జట్టు... నాగ్‌పూర్‌లో కర్ణాటకతో విదర్భ... కోయంబత్తూరులో తమిళనాడుతో డిఫెండింగ్ చాంపియన్ సౌరాష్ట్ర తలపడనున్నాయి.

చెన్నై X బెంగళూరు

మార్చి 22న ఐపీఎల్ మొదటి పోరు
- తొలి దశ షెడ్యూల్ విడుదల
- వైజాగ్‌లో రెండు ఢిల్లీ జట్టు మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)–2024కు అధికారికంగా నగారా మోగింది. మార్చి 22న జరిగే టోర్నీ తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ తమ సొంతగడ్డపై రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టుతో తలపడుతుంది. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీసీసీఐ రెండు దశల్లో ఐపీఎల్‌ను నిర్వహించాలని నిర్ణయించింది. అందుకే తొలి దశలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 7 మధ్య జరిగే 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌ను మాత్రమే విడుదల చేసింది. లీగ్‌లో మొత్తం 74 మ్యాచ్‌లు జరుగుతాయి. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత మిగిలిన 53 మ్యాచ్‌ల తేదీలు, వేదికలను బోర్డు ప్రకటిస్తుంది. గత రెండు సీజన్ల తరహాలోనే 10 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ టీమ్ లీగ్ దశలో 14 మ్యాచ్‌లు ఆడుతుంది. టోర్నీ ఫైనల్ మే 26న జరిగే అవకాశం ఉంది. తొలి 21 మ్యాచ్‌ల షెడ్యూల్‌లో నాలుగు తేదీల్లో ఒకేరోజు రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. ఈ 17 రోజుల్లో ఢిల్లీ, గుజరాత్, బెంగళూరు గరిష్ఠంగా ఐదేసి మ్యాచ్‌ల చొప్పున ఆడతాయి.

అందుకే విశాఖలో...

ఆంధ్ర క్రికెట్ అభిమానులకు ఐదేళ్ల విరామం తర్వాత ఐపీఎల్ మ్యాచ్‌లు చూసే అవకాశం దక్కుతోంది. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ తమ రెండు 'హోమ్' మ్యాచ్‌లను వైజాగ్‌లో ఆడాలని నిర్ణయించుకుంది. క్యాపిటల్స్ సొంత వేదిక ఫిరోజ్‌షా కోట్లా మైదానం మార్చి 17న జరిగే డబ్ల్యూపీఎల్ ఫైనల్ సహా మొత్తం 11 మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తోంది. దాంతో ఐపీఎల్‌కు ముందు గ్రౌండ్ సన్నద్ధతకు తగినంత సమయం లభించడం లేదు. ఈ కారణంగా క్యాపిటల్స్ తమ వేదికను వైజాగ్‌కు మార్చింది. విశాఖలో వైఎస్ఆర్ ఏసీఏ–వీడీసీఏ స్టేడియం ఇప్పటి వరకు 13 ఐపీఎల్ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇచ్చింది. ఆఖరి సారిగా 2019 లీగ్‌లో ఎలిమినేటర్, క్వాలిఫయింగ్–2 మ్యాచ్‌లు ఇక్కడే జరిగాయి. మరోవైపు పంజాబ్ కింగ్స్ కూడా తమ హోమ్ వేదికను మార్చింది. ఇప్పటి వరకు మొహాలి ఈ టీమ్ సొంత గ్రౌండ్‌గా ఉండగా... చండీగఢ్ శివార్లలో ముల్లన్‌పూర్‌లో కొత్తగా నిర్మించిన స్టేడియంలో ఇకపై తమ హోమ్ మ్యాచ్‌లు ఆడుతుంది.



బెంగళూరు కెప్టెన్ డు ప్లెసిస్, చెన్నై కెప్టెన్ ధోని (ఫైల్)

ఐపీఎల్ తొలి దశ షెడ్యూల్

తేదీ	మ్యాచ్	వేదిక
మార్చి 22	చెన్నై X బెంగళూరు	చెన్నై
మార్చి 23	పంజాబ్ X ఢిల్లీ	చండీగఢ్
మార్చి 23	కోల్‌కతా X హైదరాబాద్	కోల్‌కతా
మార్చి 24	రాజస్తాన్ X లక్నో	జైపూర్
మార్చి 24	గుజరాత్ X ముంబై	అహ్మదాబాద్
మార్చి 25	బెంగళూరు X పంజాబ్	బెంగళూరు
మార్చి 26	చెన్నై X గుజరాత్	చెన్నై
మార్చి 27	హైదరాబాద్ X ముంబై	హైదరాబాద్
మార్చి 28	రాజస్తాన్ X ఢిల్లీ	జైపూర్
మార్చి 29	బెంగళూరు X కోల్‌కతా	బెంగళూరు
మార్చి 30	లక్నో X పంజాబ్	లక్నో
మార్చి 31	గుజరాత్ X హైదరాబాద్	అహ్మదాబాద్
మార్చి 31	ఢిల్లీ X చెన్నై	వైజాగ్
ఏప్రిల్ 1	ముంబై X రాజస్తాన్	ముంబై
ఏప్రిల్ 2	బెంగళూరు X లక్నో	బెంగళూరు
ఏప్రిల్ 3	ఢిల్లీ X కోల్‌కతా	వైజాగ్
ఏప్రిల్ 4	గుజరాత్ X పంజాబ్	అహ్మదాబాద్
ఏప్రిల్ 5	హైదరాబాద్ X చెన్నై	హైదరాబాద్
ఏప్రిల్ 6	రాజస్తాన్ X బెంగళూరు	జైపూర్
ఏప్రిల్ 7	ముంబై X ఢిల్లీ	ముంబై
ఏప్రిల్ 7	లక్నో X గుజరాత్	లక్నో

నోట్: తొలి మ్యాచ్ ఒక్కటే రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుండగా... మిగతా రాత్రి మ్యాచ్‌లన్నీ గం.7:30 నుంచి... మధ్యాహ్నం మ్యాచ్‌లన్నీ గం. 3:30 నుంచి జరుగుతాయి.

సిరీస్ లక్ష్యంగా...

ఐదుటెస్టుల సిరీస్‌లో భారత్ మూడో టెస్టుతో పైచేయి సాధించింది. ఇప్పుడు రాంచీలో సిరీస్ విజయమే లక్ష్యంగా బరిలోకి దిగనుంది. రోహిత్ శర్మ బృందానికి ఇప్పుడు యువ ఆటగాళ్లే బలంగా మారారు. యశస్వి జైస్వాల్, సర్ఫరాజ్ ఖాన్ అవకాశాల్ని బాగా అందిపుచ్చుకున్నారు. ఇపుడు ఇదే బలగంతో ఒక మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను ఇక్కడే ముగించాలని టీమిండియా ఆశిస్తోంది.

- సమరోత్సాహంతో టీమిండియా
- నేటి నుంచి ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు
- ఒత్తిడిలో స్టోక్స్ బృందం
- ఉదయం గం. 9:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

రాంచీ: తొలి టెస్టులో ఇంగ్లండ్ చేతిలో అనూహ్యంగా ఓడిన భారత్ ఆ తర్వాత వరుసగా రెండు, మూడు టెస్టుల్లో గెలిచింది. రెండో టెస్టులో బుమ్రా పేస్, మూడో టెస్టులో జడేజా స్పిన్ కీలక భూమిక పోషిస్తే... ఈ రెండు టెస్టుల్లోనూ యువ సంచలనం యశస్వి డబుల్ సెంచరీలు కామన్‌గా కలిసొచ్చాయి. రోహిత్, గిల్‌లతో టాపార్డర్‌కు ఏ ఢోకా లేదు. మిడిలార్డరే అనుభవలేమితో ఉంది. రజత్ పటిదార్‌కు రెండు మ్యాచ్‌ల్లోనూ అవకాశమిచ్చినా ఏమాత్రం మెప్పించలేకపోయాడు. గత మ్యాచ్ ఆడిన సర్ఫరాజ్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ నిరూపించుకున్నాడు. జడేజా శతకం మిడిలార్డర్‌ను నిలబెట్టింది. బుమ్రా లేని పేస్ బౌలింగ్‌కు తొలిసారిగా సిరాజ్ పెద్దదిక్కయ్యాడు. ఇన్నాళ్లు షమీ, బుమ్రాలతో బంతిని పంచుకునే అతను రాంచీలో ప్రధాన పేసర్‌గా బరిలోకి దిగబోతున్నాడు. స్పిన్ వికెట్ కాబట్టి ముగ్గురు రెగ్యులర్ స్పిన్నర్లు బరిలోకి దిగడం ఖాయమనిపిస్తోంది. గురువారం నెట్స్‌లో ఆకాశ్‌దీప్ గంటల తరబడి శ్రమించాడు. ఒకవేళ సిరాజ్‌కు జోడీగా అతన్ని పరిశీలించవచ్చు.



స్టోక్స్



రోహిత్

సమం కోసం ఇంగ్లండ్ సమరం

ప్రస్తుత భారత్‌తో పోలిస్తే స్టోక్స్, రూట్, డకెట్, క్రాలీ, పోప్, అండర్సన్‌లతో కూడిన ఇంగ్లండే అనుభవజ్ఞులతో మేటిగా ఉంది. అయినాసరే సిరీస్‌లో భారత కుర్రాళ్ల జోరుకు క్లెం వేయలేక డీలా పడుతోంది. రాజ్‌కోట్‌లో అయితే మొదటి ఇన్నింగ్స్‌లో అదరగొట్టిన స్టోక్స్ సేన రెండో ఇన్నింగ్స్‌కు వచ్చేసరికి చేతులెత్తేసింది. రూట్, ఒలీ పోప్, బెయిర్‌స్టోల వైఫల్యం జట్టుకు ప్రతికూలంగా మారింది. చాన్నాళ్ల తర్వాత కెప్టెన్ స్టోక్స్ బౌలింగ్ వేసేందుకు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాడు. గతేడాది యాషెస్ సిరీస్ మధ్యలోనే మోకాలి గాయం వల్ల స్టోక్స్ పూర్తిగా బ్యాటింగ్‌కే పరిమితమయ్యాడు. గత జూన్ నుంచి బౌలింగ్‌కే దిగలేదు. ఇప్పుడు మాత్రం బంతిపట్టే యోచనలో పడ్డాడు. వరుస మ్యాచ్‌ల ఓటమిలతో ఇంగ్లండ్ తుది జట్టులో మార్పులు చేసింది. లెగ్ స్పిన్నర్ రేహన్ అహ్మద్ స్థానంలో ఆఫ్‌స్పిన్నర్ షోయబ్ బషీర్‌ను హార్ట్‌లీకి జోడీగా బరిలోకి దించుతోంది. మార్క్ వుడ్‌ను తప్పించి రాబిన్సన్‌ను తుది జట్టులోకి తీసుకున్నారు.

జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), జైస్వాల్, శుబ్‌మన్ గిల్, పటిదార్, సర్ఫరాజ్, ధ్రువ్ జురెల్, జడేజా, అశ్విన్, సిరాజ్, కుల్దీప్, ముకేశ్/ఆకాశ్‌దీప్.

ఇంగ్లండ్: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, ఒలీ పోప్, జో రూట్, బెయిర్‌స్టో, ఫోక్స్, హార్ట్‌లీ, బషీర్, రాబిన్సన్, అండర్సన్.

మహిళల లీగ్‌కు వేళాయెె...



డబ్ల్యూపీఎల్ ట్రోఫీతో కెప్టెన్లు స్మృతి, బెత్ మూనీ, అలీసా హీలీ, మెగ్ లానింగ్, హర్మన్‌ప్రీత్

నేటి నుంచి డబ్ల్యూపీఎల్	బరిలో 5 జట్లు, 22 మ్యాచ్‌లు	తొలి మ్యాచ్‌లో ముంబైతో ఢిల్లీ 'ఢీ'	మార్చి 17న ఫైనల్ పోరు

రాత్రి గం. 7:30 నుంచి స్పోర్ట్స్–18, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టి20 క్రికెట్ టోర్నీ రెండో సీజన్‌కు రంగం సిద్ధమైంది. గత ఏడాది తొలి సీజన్‌లో అభిమానులను ఆకట్టుకొని పలువురు యువ క్రికెటర్లను వెలుగులోకి తెచ్చిన ఈ లీగ్ మరోసారి అదే స్థాయిలో ఆసక్తికరంగా సాగే అవకాశం ఉంది. నేడు చిన్నస్వామి స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌లో గత సీజన్ విజేత ముంబై ఇండియన్స్‌తో రన్నరప్ ఢిల్లీ క్యాపిటల్స్ తలపడుతుంది. మిగతా మూడు జట్లు రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ కూడా ఈసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. గత ఏడాదిలాగే ఈసారి కూడా టోర్నీలో మొత్తం 22 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మార్చి 17న ఢిల్లీ వేదికగా ఫైనల్ జరుగుతుంది.

తాజా సీజన్ విశేషాలు....

- గత సీజన్‌లో ఒక్క ముంబైలోనే అన్ని మ్యాచ్‌లు జరిగాయి. ఈసారి బెంగళూరు, ఢిల్లీలను వేదికలుగా ఎంపిక చేశారు.
- తొలి సీజన్‌లాగే పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్లు 'ఎలిమినేటర్' మ్యాచ్‌లో తలపడతాయి.
- గత ఏడాది ఐదు టీమ్‌లకు కెప్టెన్లుగా వ్యవహరించిన వారే ఈసారి సారథులుగా ఉన్నారు. అంతర్జాతీయ క్రికెట్ నుంచి రిటైర్ అయిన మెగ్ లానింగ్ (ఢిల్లీ), అలీసా హీలీ (యూపీ), బెత్ మూనీ (గుజరాత్) ఆస్ట్రేలియన్లే కాగా...హర్మన్‌ప్రీత్ (ముంబై), స్మృతి మంధాన (బెంగళూరు) భారత స్టార్లు. భారత్ మినహా ఆసీస్ నుంచే గరిష్ఠంగా 13 మంది ప్లేయర్లు బరిలోకి దిగుతున్నారు.
- 2023 సీజన్‌లో సత్తా చాటిన సైకా ఇషాక్, శ్రేయాంక పాటిల్ ఆ తర్వాత భారత జట్టుకు ఎంపికయ్యారు. గత ఏడాది వీరిని కనీస ధర రూ.10 లక్షలకు తీసుకోగా... రెండు సీజన్ల మధ్య భారత జట్టుకు ఆడటంతో బీసీసీఐ నిబంధనల ప్రకారం వీరిద్దరికి రూ. 30 లక్షల చొప్పున లభిస్తాయి.
- ఈ సీజన్ వేలంలో కాశ్వీ గౌతమ్‌ను రూ.2 కోట్లకు గుజరాత్ జెయింట్స్ టీమ్ ఎంచుకుంది. అయితే గాయం కారణంగా ఆమె ఈ సీజన్ నుంచి అనూహ్యంగా తప్పుకోవడం గమనార్హం.
- హైదరాబాద్, ఆంధ్ర జట్ల నుంచి 8 మంది ఈసారి డబ్ల్యూపీఎల్‌లో బరిలోకి దిగనున్నారు. హైదరాబాద్ ప్లేయర్లు అరుంధతి రెడ్డి (ఢిల్లీ), త్రిష పూజిత (గుజరాత్), యషశ్రీ, గౌహర్ సుల్తానా (యూపీ) జట్లకు... ఆంధ్ర క్రికెటర్లు స్నేహ దీప్తి (ఢిల్లీ), సబ్బినేని మేఘన (బెంగళూరు), షబ్నమ్ (గుజరాత్), అంజలి శర్వాణి (యూపీ) టీమ్‌ల తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.